# కర్మ సిద్ధాంతం రామారావు కథ

"రాజారావుకి ఏక్సిడెంటయింది. కేజువాల్టిలో ఎడ్మిట్ చేసేరు, చూద్దూగానిరా" అన్చెప్పేసి ఫోను పెట్టేశాడు డాక్టర్ రమాపతిరావు.

"మరేం ప్రమాదంలేదు కదా" అని అనబోయాను. మాట నోట్లోంచి మౌత్‌పీసులోకి ఊడిపళ్లేదు.

రాజారావు బ్యాంకులో ఆఫీసరు. చాలా బుద్ధిమంతుడుగా వుండే వాడు. ఈ మధ్యనే బుద్ధిమంతుడయ్యేడు. అది చాలక లాంగ్ పార్టీస్ అయ్యేక కూడా స్కూటరుమీద ఇంటికెళ్ళడానికి ప్రయత్నిస్తున్నట్టు కూడా నాకు కర్ణాకర్ణిగా వినబడుతోంది.

పాపం పిల్లవాడు, ఏమయిందో, ఎలాంటి ఏక్సిడెంటో అని జాలి తలుస్తూ హాస్పిటల్‌కి బయలుదేరేను.

తీరా వెళ్ళేక తెలిసింది. రమాపతిరావుగాడు నేనీమధ్య అసలు కనబడ్డం లేదని ఉక్రోషంకొద్దీ వాడి నైట్‌డ్యూటీ కొంతసేపు ఆనందంగా గడవడానికి ఫోన్ చేసేడని_

"ఇదేం వెధవ కుట్ర?" అని వాడిమీద విసుక్కుని లేచి వొస్తుంటే ప్రక్కనే వున్న బెడ్‌మీంచి ఎవరో నా పేరు పిలిచినట్లయింది—— అటు చూశాను.

రామారావు!

"హలో రామారావు! ఇదేమిటిక్కడున్నావు?" అని పలకరించి, అటు వెళ్ళబోయాను.

"ఇతనొక రామారావా?" అని రమాపతిరావు నన్నాపేడు. "ఇతనికి పేరు పెట్టి మరీ కదులు!" అని నిలదీశాడు.

స్నేహ వలయంలో రామారావులు ఎక్కువయ్యేరని- రామారావు అనే పేరు మరీ ఎక్కువమందికి వుంటుందని చెప్పుల రామారావు, చిప్పుల రామారావు, థర్టీవన్ రామారావు, అమర గాయకుడు రామారావు, అక్కినేని రామారావు— ఇలా పేర్లెట్టుగున్నాం. కథ నడవడం లేదని మీరు కోప్పడకపోతే వారందరి విశేషాలూ మనవి చేస్తాను. చెప్పుల రామారావంటే కరోనా షాపులో మేనేజరుగా ఉద్యోగం చేస్తున్నతను. చిప్పుల రామారావంటే మందు పార్టీల్లో జీడిపప్పు వదిలేసి చిప్సుమీద దండయాత్ర సాగించే ఆయన. థర్టీవన్ రామారావు ముప్పై రెండు పళ్ళలో ఒక పన్ను మిస్సింగ్. అమర గాయకుడు రామారావు- ఎప్పుడో ఒకసారి పాట పాడేడు, మళ్ళీ పాడితే చంపేస్తాం అని ఫ్రెండ్సు వార్నింగిచ్చేరే, అతను!

"ఇతనా? కర్మ సిద్ధాంతం రామారావు అని- చూస్తావుగా!" అని రమాపతిరావుని విడిపించుకుని రామారావు బెడ్ దగ్గర కెళ్ళాను. నా వెనకాలే అతనూ వచ్చేడు.

"ఇదేంటి రామారావు? యామైంది నీకు?" అని అతని బుజ మ్మీద చెయ్యేసి పలకరించేను.

"హాస్పిటాలిటీ నుంచి హాస్పిటల్‌కి చేరేను. అంతా నా కర్మ!" అన్నాడు రామారావు.

"తెలిసిందా, కర్మసిద్ధాంతం రామారావని ఎందుకన్నానో?" అన్నట్టుగా రమాపతిరావు వంక చూశాను. అతను సార్థకంగా నవ్వాడు.

రామారావు చెప్పిన కథ యిదీ:

ఉదయమే వచ్చేట్ట, ఎలమంచిలి నుంచి. అతనీమధ్య వ్రాసిన కవితలన్నీ ఒక సంపుటంగా వేయించుకోవాలని రాజశేఖరం సలహా కోసం అతనింటికి వెళ్ళాడట, అతను లేట్ట. ఒక చీటీ పెట్టి వెళ్ళాడట.

మధ్యాహ్నం ఎక్కణ్ణించో ఫోన్ చేస్తే రాజశేఖరం కొడుకు మాట్లాడేట్ట. సాయంకాలం ఏడుగంటలకి హోటల్ మేనకాలో నూట పధ్నాలుగో రూంలో వుంటాను, రమ్మని నాన్నారు చెప్పేరండీ అన్నాట్ట.

ఇల్లుకంటె గుడిపదిలం కదా, చెప్పే కబుర్లేవో అక్కడే చెప్పొచ్చుకదా అని సరిగ్గా ఏడింటికి హోటల్ మేనకా నూట పధ్నాలుగో రూం దగ్గిర వున్నాట్ట.

"దేన్ని గురించి మీ పొయిట్రీ?"

"నన్ను సలహా అడుగుదామనా, పుస్తకం అచ్చేయించటానికి డొనేషన్ అడుగుదామనా?"

ఇలాంటి ప్రశ్నలు వేసేట్ట రాజశేఖరం.

మొదటి ప్రశ్నకే పరవశుడై రామారావు తన బ్యాగ్‌లోంచి పొయిట్రీ తీసి చదవ నారంభించేట్ట. వస్తు వైవిధ్యం తెలీడానికి కొంచెం "కదిలేదీ కదిలించేదీ" వేసుకుందామా అని సూచించి. రాజశేఖరం ఏమీ అనకముందే బెల్‌నొక్కి బేరర్ని పిల్చి ఒక "హాఫ్" ఆర్డర్ చేసి— ద్రవానికి ఉపద్రవం; పానానికి అనుపానం (సోడాలూ, చిరుతిళ్ళూ) పద్ధతిగా రప్పించేడుట్ట.

అంతా అయిపోయేలోగా తాను పుస్తకరూపంలో ప్రచురించ బోయే కవితా ఖండికలన్నీ చదివి వినిపించేశాట్ట.

బిల్లు చెల్లించటం దగ్గిర కర్మ సిద్ధాంతం ప్రవేశించింది. నూట పధ్నాలుగో నెంబరు రూంలో సాయంకాలం అయిదు గంటలవరకు కేశవరావు వుండేవాడని, రూంబిల్లు చెల్లించేసి వెళ్ళాడని, నిన్న రాత్రి పది గంటలకి అతను రూంలో దిగివుండడాన్ని, ఈ రాత్రి పది గంటల వరకూ రూము ఖాళీగా వుండడ మెందుకని తనక్కడ కూచున్నానని రాజశేఖరం చెప్పాడట.

"నేనిది ఊహించలేదు. బిల్లు మీరు చెల్లించండి, అది నా పుస్తకానికి డొనేషన్‌గా మీ పేరిట స్వీకరిస్తాం." అన్నాట్ట రామారావు.

"నీ దగ్గిరుంటే ఇచ్చెయ్యి, పోదాం" అని రాజశేఖరం మొండి కేశాట్ట.

"నా దగ్గర లేదు సార్! మీరేదో కవితా ప్రియులని-" అని నాన్చాడట రామారావు.

"అయితే నేనివ్వాలంటావు!" అని రాజశేఖరం లేచి, "సరే, నువ్విక్కడే వుండు, నే నెక్కడికైనా వెళ్ళి తెస్తాను!" అన్నాట్ట.

అలా గంట కూచున్నాట్ట, రామారావు.

రాజశేఖరం రాలేదు, ఫోనొచ్చింది.

"దొంగ గాడిదా! నీ పొయిట్రీ అంతా నాకు చదివి వినిపించడమే కాక; విన్నందుకు నన్ను తృప్తిపరచడం పోయి నీకు నేను పార్టీ యివ్వాలిరా! అని ఇంకా యేవో తిట్టి ఫోను పెట్టేశాట్ట."

అంతే, హోటలు వాళ్లు ఇద్దరు బాయ్స్‌ని పంపగా, ఇతని వాచీ లాక్కోడంలో కొంత ఘర్షణ జరిగి, వాడెవడో ఒక్కతోపు తోస్తే తల ద్వారానికి కొట్టుకోవడంవల్ల హాస్పిటల్లో చేరడమైందిట.

ఇంతకీ చెప్పండి నా పొయిట్రీ విన్నందుకు ఆతిథ్యం ఆయన నా కివ్వాలా, నే నాయన కివ్వాలా?" అని అడిగాడు రామారావు.

"దానికేముందీ, ఎలాగైనా చెయ్యొచ్చు. అయితే, ధర్మ సూక్ష్మం అడిగారు కనక చెబుతాను. ఇద్దరు స్నేహితులు కలుసు కున్నప్పుడు ఒకడేమో "కాఫీ తాగుదాం రా గురూ" అంటే బిల్లు అతనే యివ్వాలి. "కాఫీ యిప్పించు గురూ" అంటే రెండోవాడిచ్చు కోవాలి. "కాఫీ తాగితే బాగుండేటట్లుంది" అన్నప్పుడు ఎవరి దగ్గిర డబ్బులుంటే వాళ్ళు, లేదా ఫిఫ్టీ ఫిఫ్టీ- ఇలా తీర్మానించుకోవాలి. ఇంతకీ సీసా పద్యం మీరు పాడేరా, అతనా!" అన్నాను.

"నేనే మొదట ఎత్తుకున్నట్టున్నాను........ ఏమిటో, కర్మ!'' అని రామారావు నెత్తికొట్టుకుని "అమ్మ!'' అన్నాడు, కట్టుమీద చెయ్యి తగిలి.

(24-12-77)